# తొమ్మిదోకష్టం

రాత్రి తొమ్మిది గంటల సమయంలో టేబిలు మీద ఫోను మ్రోగింది. రిసీవరుఎత్తి "హలో" అన్నాను.

" వుడా నుండి మాట్లాడుతున్నాం. మీరు మీ ఖాళీస్థలం క్రమబద్ధీకరణ కోసం ... అదే LRS స్కీము కింద ... ఎప్లయి చేశారు కదా..."

" అవునండీ! ఎప్లయి చేశాను!"

" మీకు 'ఎప్రూవల్' వచ్చేసింది! రేపు మధ్యాన్నం మూడు గంటలకి 'వుడా కాన్ఫరెన్సు' హాలుకి వచ్చి మీ 'ఎప్రూవల్ పేపర్లు' తీసుకోండి"

నాచెవులను నేను నమ్మలేకపోయాను!!

"అది కాదు..."అంటూ నేను నాసందేహ నివృత్తి చేసుకునేలోగానే ఫోను పెట్టేశారు. వెంటనే వుడా ఆఫీసు నెంబరుకు ఫోను చేశాను. ఎవ్వరూ ఫోను తియ్యటం లేదు!

'నేను విన్నది నిజమా? లేక ఎవరయినా నన్ను ఆటపట్టించటానికి ఫోన్‌చేశారా?' అని కొంతసేపు ఆలోచనలో పడ్డాను.

నా 'లేఅవుట్' లోనే మరో స్థలం కొనుక్కున్న నా బాల్యమిత్రుడు, రమణారావు కి ఫోను చేశాను. వాడే ఫోన్ ఎత్తేడు. "రమణా ఇప్పుడే వుడా నుండి ఫోన్ వచ్చిందిరా ! ... మన 'లేఅవుట్' లోని నా స్థలానికి వుడా 'అప్రూవల్' ఇచ్చేసిందిట! ఇప్పుడే వుడావాళ్ళే ఫోను చేసి చెప్పారు ..." అని మాట్లాడుతూవుంటే, నామాటలకి అడ్డం పడుతూ "ఒరేయ్ ... ఇంతరాత్రి వేళ చెవిలోపువ్వెట్టడానికి ఇంకెవరూ నీకు దొరకలేదేమిటిరా?...'ఇలియానా' స్వయంగా నీకు ఫోను చేసి, ఈ వేళ రాత్రికి వాళ్ళింటికి డిన్నరుకు పిలిచిందని చెప్పు!.... నమ్ముతాను!... ఈ విశాఖ మహానగరంలోని యు.జి.డి. గోతులన్నీ రాత్రికి రాత్రే పూడ్చేశారని చెప్పు!... నమ్ముతాను! ద్వారకానగర్‌లోని ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకో అయిదు సంవత్సరాలలో పూర్తిఅయిపోతాయని చెప్పు! నమ్మటానికి ప్రయత్నిస్తాను... బిల్డింగు ఇనస్పెక్టరు రూపాయి లంచం తీసుకోకుండా వాళ్ల స్వంతమామగారికి ఇంటిప్లాను 'ఎప్రూవ్' చేశాడని చెప్పు! అది నమ్మశక్యం కాకపోయినా నమ్మినట్లు నటిస్తాను!... అంతేకానీ, వుడా వాళ్ళు LRS స్కీము కింద ఇంత తొందరగా నీ స్థలానికి ఎప్రూవల్ ఇచ్చేసేరంటే ... అదికూడా... వాళ్ళే ఫోను చేసి చెప్పేరంటే నేను నమ్మను గాక నమ్మను!!.... మన సన్నాసిరావుగాడు నిన్ను 'ఏప్రిల్‌ఫూల్' చేయటానికి గొంతు మార్చి, ఫోను చేసి వుంటాడు..." అన్నాడు గుక్కతిప్పుకోకుండా! " ఈవేళ ఏప్రిల్ ఫస్టు కాదుకదా ... జూన్ ఫస్టు!" అన్నాను."నువ్వు చెప్పింది కరెక్టే ...కానీ ఈ సమయానికి వాడు మూడోపెగ్గులో వుంటాడు! వాడికి ఏప్రిల్ ఫస్టుకీ జూన్ ఫస్టుకీ తేడా

ఏం తెలుస్తుంది? వాడే ఇలాంటి న్యూసెన్సు ఫోనులు చేస్తూ వుంటాడు... ఆరు నెలలక్రిందట ఇలాగే ఓ రాత్రి నాకు ఫోను చేశాడు. 'రాజీవ్ స్వగృహస్కీములో ఇళ్ళు 'ఎలాట్ మెంటు' జరుగుతోందిట!... నీకు వచ్చిందా?... ఆమధ్య అయిదు వేలు కట్టావు కదా!'... అంటూ అడిగేడు. వాడి మాటలు నమ్మి పదిరోజులబాటు తిరిగి తిరిగి తాసీల్దారుని పట్టుకున్నాను. అయన ఈ విషయంవిని విక్రమార్కుడి భుజం మీద భేతాళునిలా నావంక చూసి ఓ విషపు నవ్వు నవ్వేడు. "ఈ నగరంలో ఫ్లాట్‌లు కట్టాలా? ఇళ్ళు కట్టాలా? అనే విషయం ఇంకా తేలలేదు! తేలటానికి ఇంకో రెండేళ్ళు పడుతుంది. తేలిన తరువాత అవి పూర్తవటానికి మరోనాలుగేళ్ళు పడుతుంది. అందువల్ల మీరు ఏమీ  అనుకోకుండా, ఆరుసంవత్సరాల తర్వాత ఇదే డిశెంబరు ఆరవ తేదిన కనిపించండి" అంటూ ముక్తాయించేడు. అందుకని నామాటవిను! ఇలాంటి పిడత పనులన్నీ ఆ సన్నాసి రావుగాడే  చేస్తూవుంటాడు. వాడికోసారి ఫోన్‌చెయ్! గుడ్‌నైట్!" అంటూ ఫోను పెట్టేశాడు రమణారావు.

క్షణంలో నా ఆనందమంతా ఆవిరయిపోయింది! సన్యాసిరావు సెల్ కి ఫోను చేశాను వెంటనే!! " హలో! చెప్పరా! ఏమిటి సంగతులు? అన్నాడు అవతల నుండి

" ఎక్కడున్నావ్?"

"వాల్తేరు క్లబ్బులో! ఈవేళ దీపక్ శర్మగాడి అరవై అయిదో పుట్టినరోజు! ఆ సందర్భంగా పటాసు పేలుస్తున్నాడు! మంచి 'స్కాచ్' తెప్పించాడు! మూడో రౌండులో వున్నాం!..." అంటూ ఏదేదో చెప్పుకు పోతున్నాడు.

రమణగాడు ఊహించింది కరెక్టే! వీడు మూడో రౌండులో వున్నాడు!! "అరేయ్! అయిదునిమిషాలు కిందట నువ్వు నాకు ఫోన్ చేశావా?" అని అడిగేను.

"ఏమిటా చచ్చు ప్రశ్న? హాయిగా వాల్తేరు క్లబ్బులో స్కాచ్ ఎంజాయ్ చేస్తూ, నీకెందుకు ఫోను చేస్తాను? నాకున్న స్నేహితులలో నువ్వు కాస్త 'జంటిల్మన్' వి కాబట్టి, నీ 'కాల్' తీసుకున్నాను. ఇంకెవరయినా అయివుంటే 'ఈఫోను తాత్కలికముగా 'హేంగోవరు'లో వున్నది! రేపుపొద్దుట తొమ్మిదిగంటల వరకూ పనిచేయదు! మీరు ఫోనుచేసి నందులకు ధన్యవాదాలు' అంటూనేనే చెప్పి, ఫోనుకట్ చేసి వుండే వాణ్ణి!" అంటూ వాడి 'జోక్' కి వాడే నవ్వటం ఆరంభించేడు.

"వుడా ఆఫీసు నుండి ఇప్పుడే ఫోను వచ్చిందిరా! నా స్థలానికి అప్రూవల్ ఇస్తున్నామని చెప్పేరు. రేపు మధ్యాహ్నం వచ్చి ఆఫీసులో పేపర్లు తీసుకోమన్నారు. నువ్వుగానీ, నన్ను ఆటపట్టించటానికి గొంతుమార్చి ఫోను చేశావేమోనని..." అంటూవుంటే, నామాటలకి అడ్డం పడుతూ "... స్కాచ్ తడిసిన గొంతుకరానాది! అలాంటి గొంతు మార్చి ఇలాంటి చెత్త విషయాల గురించి ఫోను చేస్తానా?... అది సరేగానీ, వుడాలో ఎవరికయినా చేతులు తడిపావా?" అంటూ అడిగేడు. " వాళ్ళు అడిగిన ఫీజులు కట్టేసరికే

నాది ఆరు నెలల 'పెన్షన్' హుష్‌కాకీ అయిపోయింది. ఇంక కాళ్ళూ చేతులూ ఎలా తడపనురా బాబూ! అయినా, అలాంటి పనులు నా ప్రిన్సిపల్స్‌కి విరుద్ధం... నీకు తెలుసుకదా!..." అన్నాను.

" అయితే, అది 'ఫేక్ కాల్' అయివుంటుంది. దాని విషయం బుర్రలోంచి తుడిచి పెట్టి హాయిగా నిద్రపో!గుడ్‌నైట్!! అంటూ ఫోను కట్ చేశాడు.

'ఫోనుకాల్ నిజమయితే ఎంతబాగుండును?' ఏది ఏమైనా, రేపు మధ్యాన్నం వుడా ఆఫీసుకు వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను. మంచం మీద వాలేను కానీ నిద్రపట్టలేదు!

గతమంతా కనుల ముందు కదిలింది!!!.

* * *

నేను విశాఖపట్నంలో ఉద్యోగంలో చేరిన కొత్తలో అంటే, సుమారు నలభై సంవత్సరాల క్రితం, ఊరి శివార్లలో మూడు వందల గజాల ఇంటి స్థలం ఒకటి కొనుక్కున్నాను! అయిదేళ్ళకొకసారి ఆ స్థలంలో పెరిగిపోతున్న తుప్పలను కొట్టిస్తూ , నా స్థలం సరిహద్దురాళ్ళను తడిమి చూసుకుంటూ, ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా, దానిని కాపాడుకుంటూ వస్తున్నాను! 'రియల్ ఎస్టేట్ బూమ్' వచ్చినా, నా అదృష్టం కొద్దీ ఆ స్థలాన్ని ఎవరూ కబ్జా చెయ్యలేదు! అమ్మేద్దామంటే పంచాయితీ పెర్మిషనే కానీ 'వుడాఎప్రూవల్' లేదు కాబట్టి రేటు పలకటం లేదు. సాహసించి కొనటానికి కూడా ఎవ్వరూ ముందుకు రావటం లేదు.

అయితే, మూడు సంవత్సరాలు క్రితం పేపర్లో ఓ ప్రకటన వచ్చింది. స్థలాల క్రమబద్ధీకరణ LRS స్కీము కింద, కొన్ని నిబంధనల మేరకు, వాళ్ళు సూచించిన ఫీజు చెల్లిస్తే, 'వుడా అప్రూవల్' ఇచ్చేస్తారని దాని సారాంశం. వాళ్ళు సూచించిన నిబంధనల మేరకు నా స్థలం వుంది. అందువలన 'అప్రూవల్' కోసం అప్లికేషను పెడితే మంచిదనిపించింది.

వెంటనే నా ప్రక్కనే స్థలం కొన్న నా బాల్యమిత్రుడు రమణారావు ఇంటికి పరుగెత్తేను. వాడికి ఆ ప్రకటన చూపించేను. వాడు ఆ ప్రకటన అంతా రెండుమార్లు చదివేడు! మూడు మార్లు నోరు చప్పరించేడు!!

తర్వాత నాలుగు మార్లు బుర్ర ఇటూ అటూ తాటికాయ ఊపినట్టు ఊపేడు!

ఆ తర్వాత తాపీగా అన్నాడు. "ఇవేమీ ఇచ్చీవీ చచ్చీవి కావురా బాబూ! ఆ ఆఫీసు చుట్టూ మనం కాళ్లరిగేలా తిరగాలి. అళ్ళని బాగామేపాలి. ఇవన్నీ దండుగ పనులురాబాబూ! ఇంతా చేసి, ఇన్ని పాట్లు పడి, ఇన్ని తిరుగుళ్ళూ తిరిగి, నువ్వు 'వుడాఎప్రూవల్' తెచ్చుకున్నా, ఇల్లుకట్టే వేళకి ప్లాను ఎప్రూవల్ చేయించుకోవాలంటే

బిల్డింగ్ ఇనస్పెక్టర్‌కు ఎలాగూ చేతులు తడపక తప్పదు. ఇప్పుడు ఊరుకొని ఇల్లుకట్టే ముందు ఆ మొత్తమంతా బిల్డింగు ఇనస్పెక్టర్‌కి పడేస్తే, ఆయనే ఏవో తంటాలు పడి మనకి ప్లాను 'ఎప్రూవల్' ఇస్తాడు. ఇందరి కాళ్ళు పట్టుకోవటం కంటే ఒక్కడి కాళ్ళు పట్టుకుంటే మంచిది! అందుకని నామాటవిను! డబ్బులు పాడు చేసుకోకు" అంటూ హితబోధ చేశాడు.

" అది కాదురా! ప్రభుత్వం అవకాశం ఇస్తున్నపుడు, దానిని సద్వినియోగం చేసుకోకపోతే అది మన తప్పే అవుతుంది. అందుకని డబ్బు కట్టేసి 'ఎప్రూవల్' తెచ్చుకోవటమే మంచిది అనిపిస్తోంది నాకు. నేను అప్లయి చేయదల్చుకున్నాను" అన్నాను.

" సరే! నీ ఇష్టం! పోగాలము దాపురించిన వారు దీప నిర్వాణగంధమును, అరుంధతిని, మిత్రవాక్యమును; మూర్కొనరు, కనరు, వినరు అని మన చిన్ననాడే చిన్నయసూరి అనే మహానుభావుడు క్రమాలంకారంలో చెప్పేడు. ఈ పెద్ద వయసులో మళ్ళీ నేను చెబుతున్నాను. నువ్వు డబ్బు తగలేసుకుంటానంటే అది నీ ఇష్టం!" అన్నాడు. వాడితో వాదించి లాభం లేదని ఇంటికి వచ్చేశాను.

నాలుగు రోజుల తర్వాత వుడా ఆఫీసుకు వెళ్ళేను. అక్కడ అరకిలోమీటరు పొడవయిన 'క్యూ' చూసి ఆశ్చర్యపోయాను. రెండు గంటల సేపు క్యూలో నిలబడి అప్లికేషను అనబడే ఓ పెద్దపుస్తకం లాంటిది కొనితెచ్చుకున్నాను.

రెండురోజుల బాటు ఆ పుస్తకం అంతా ఆ చివర నుండి ఈ చివరవరకూ క్షుణ్ణంగా చదివేను. నింపవలసిన గళ్ళు తక్కువే అయినా, జత చేయవలసిన అనుబంధపత్రాలు మాత్రం బోలెడువున్నాయి. నేను నా ఉద్యోగంలో 'ఎన్విరాన్‌మెంట్ సెక్షను' లో పనిచేసేటపుడు 'రాష్ట్ర కాలుష్యనియంత్రణా బోర్డు' వారికి వివరాలు ఇవ్వటానికి, ప్రతినెలా ఇంతకంటే పెద్ద పుస్తకాలే నింపి పంపించేవాడిని. అందువల్ల అప్లికేషను నింపటం నాకు పెద్దపనిలా అనిపించలేదు!

అసలు సమస్య అంతా డ్రాయింగుల దగ్గనే వచ్చింది.

మొత్తం 'లే అవుట్' ప్లానులో నా స్థలం గుర్తు పెట్టి చూపిస్తూ ఓ డ్రాయింగు గీయించి దానివి అయిదు కాపీలు జతపరచాలి. అదికూడా వాళ్ళు సూచించిన 'లైసెన్స్‌డ్ సర్వేయరు' చేతనే గీయించాలి,. వాళ్ళ పుణ్యమా అని వారి పేర్లలిస్టు, ఫోనునెంబర్లతో సహా ఆపుస్తకంలో ఇచ్చేరు. వాటిలో ఓ ఫోను నెంబరుకు డయల్ చేశాను.

" హలో పుండరీ కాక్షంగారేనా?" అంటూ అడిగేను.

" అవును ... చెప్పండి... సైటు ఎక్కడ?... సర్వేనెంబరు ఎంత?..." అంటూ గడగడా మాట్లాడేస్తున్నారు అవతలి నుండి. వివరాలన్నీ చెప్పేను.

" ఎల్లుండి పొద్దుట సరిగ్గా ఏడుగంటలకి. ఎ.సి. టాక్సీతీసుకొని సీతమ్మధార మండలి ఆఫీసు ఎదురుగా నిలబడి వుండండి! సైటుకెళ్ళి చూసి వద్దాం. తర్వాత నేను మీకు అవసరమయిన డ్రాయింగులు గీసి ఇస్తాను. ఫీజు అయిదువేలు అవుతుంది. బేరాలు ఆడకండి".

"నా దగ్గర ఓ డ్రాయింగు వుందండీ..." అంటూ ఇంకా చెప్పబోతూవుంటే నామాటకు అడ్డంపడుతూ... "అది పనికిరాదు! వాళ్ళకి కావల్సిన రీతిలో మేంగీసిఇస్తాం! అందుకే మాపేర్లు ఇచ్చేరు వాళ్ళు! వాటిమీద సంతకాలు పెట్టి మాస్టాంపు వెయ్యాలి! లేకపోతే 'ఎప్రూవల్ ' రాదు" అన్నాడాయన.

" సరేనండీ...టాక్సీతీసుకువస్తాను!"

"టాక్సీ కాదు ఎ.సి. టాక్సీ! నాకు సన్ ఎలర్జీవుంది! ఎండపడదు! సూర్యునికీ నాకూ విరోధం! అందుకని ఓ గొడుగు కూడా తీసుకురండి! మీరు నామీద ఎండపడకుండా గొడుగు పట్టుకుంటే, నేను కొల్తలు తీసుకుంటాను! సరేనా? ఓ మూడువేలు ఎడ్వాన్సు కూడా తెండి!" అంటూ నా సమాధానం కోసం చూడకుండా ఫోను పెట్టేశారు పుండరీకాక్షంగారు.

ఆ మూడోరోజున ఎ.సి టాక్సీలో పుండరీకాక్షంగారిని నా సైటుకు తీసుకు వెళ్ళేను. ఆయన మీద ఎండపడకుండా గొడుగు పట్టుకుని స్థలం కొలతలు తీయించేను. తర్వాత ఇరవై రోజులు డ్రాయింగుల కోసం ఆయన ఇంటి చుట్టూ తిరిగేను. మొత్తానికి వాటిని సంపాదించి నాఅప్లికేషను ఫారం అనబడే పుస్తకానికి జతచేసి, ఇరవైవేల రూపాయల చలానాతో సహా అంతా కలిపి 'వుడా' ఆఫీసులో సమర్పించేను. ఈ వ్యవహారమంతా మొత్తం నెలరోజుల్లో పూర్తయింది!

ఆ తర్వాత ఆరునెలలు గడిచిపోయినా వుడా ఆఫీసునుండి వులుకూ, పలుకూ లేదు. క్రమబద్ధీకరణకు అప్లికేషన్లు తీసుకునే గడువు తేది మాత్రం అలా పొడిగిస్తూనే వున్నారు! అప్పటి నుండి నెలకోమారు ఆఫీసుకు వెళ్ళినా, నాఫైలు ఏస్థితిలో వుందో చెప్పేనాథుడే కరువయ్యాడు.

ఇలా ఒక సంవత్సర కాలం గడిచి పోయింది!

కనీసం నాస్థలం ఇనస్పెక్షన్ చేయటానికి కూడా ఎవ్వరూ రావటం లేదు...

ఇలా లాభం లేదని, ముందస్తు ఇంటర్వ్యూ తీసుకుని వుడాలో వున్న అతిపెద్ద ఆఫీసరు గారి దగ్గిరకు నేరుగా వెళ్ళేను. ఆయన పేరు అఖిలాండ బ్రహ్మాండ కోటి నాయకుడు గారు! సింపుల్‌గా ఎ.బి.కె. నాయకుడు గారు! ఆయనకి నాగోడు వినిపించేను!

ఆయన వెంటనే ఓ స్లిప్పు మీద ఓ ఫోను నెంబరు రాసి ఇచ్చేరు!

"రేపు పొద్దుట  మీరు మీ స్థలం దగ్గర వుండండి! మా స్టేఫ్ ఆ ఏరియా సర్వేనెంబర్లకే వస్తున్నారు. మీకిచ్చిన ఫోనునెంబరు మా శార్దూలం గారిది. ఆయనకి నేను చెబుతాను. మీరు ఫోనుకొడితే, ఆయన మా స్టాఫ్‌తో వచ్చి మీసైటు ఇనస్పెక్షను చేస్తారు" అన్నారు.

ఆయనకు రెండు చేతులూ జోడించి నమస్కరించి, ఇంటికి వచ్చేశాను.

మరునాడు ఆయన చెప్పిన ప్రకారమే నా సైటుకు చేరుకుని శార్దూలం గారి నెంబరుకు ఫోను చేశాను.

"అక్కడే వుండండి! మరోగంటలో వస్తాం!" అని చెప్పి మధ్యాన్నం ఒంటిగంటకు, ఇంకో నలుగురు వస్తాదుల్లాంటి మనుష్యులతో కలిసి జీపుదిగేడాయన! దిగుతూనే చిరునవ్వుతో నన్ను పలకరించి, సగ్రున టేపు బయటకు లాగి, వాళ్ళచేత నా స్థలం కొలతలు తీయించి రాసుకున్నారు శార్దూలంగారు. ఆయన చేతిలో నా ఫైలువుంది. దాన్ని అటూఇటూ తిరగేసి అందులోంచి నేను పెట్టిన డ్రాయింగులు మొత్తం పీకేసి వాటిని నా చేతిలో పెట్టారు. "ఈ డ్రాయింగ్ పనికిరాదు' మొత్తం 'లేఅవుట్' మాస్టర్ ప్లానకావాలి! పక్కసైట్ల వాళ్ళ దగ్గిర ఎవరి దగ్గరినయినా వుందేమో, సంపాదించండి దాని కాపీలు అయిదు తీయించి, సర్వేయరు చేత సంతకం చేయించి స్టాంపు వేయించి, వాటిని పదిరోజుల్లోగా మాకివ్వండి!..." అని కాస్సేపాగి... "ప్రతి చిన్నవిషయానికీ పెద్దాయన దగ్గరకు వెళ్ళకండి!... పని చేయవలసినది మేము... మా దగ్గర కొస్తే మేం చేస్తాం... అర్థమయిందా?"... అంటూ కాస్త చిరాకు ప్రదర్శించేరు.

"అలాగే సార్!..." అంటూకాస్సేపాగి "ఈ స్థలం నలభైసంవత్సరాలు క్రితం కొన్నాను. అప్పుడు పంచాయితీ ఎప్రూవల్ తో ఇచ్చిన డ్రాయింగు వుంది! మళ్ళీ మాస్టరు ప్లాను అంటే నేను ఎక్కడ తేగలను? అయినా పంచాయితీలన్నీ వుడాలో కలిపేసినపుడు అవన్నీ మీదగ్గరే వుంటాయి కదా సార్?" అంటూ కాస్త భయంగానే అడిగేను.

" మాదగ్గర వుంటే మిమ్మల్నెందుకు అడుగుతాం!... అదిసంపాదించండి..." అంటూ వుంటే, ఆయన జేబులో ఫోను కాబోలు మోగింది! 'భలెభలెభలెభలె ఇరణ్యకశిపుడరా! నిన్ను ఇరచక తింటానురా!... నృశింహరాజునిరా ...నిన్ను... నంచుకతింటానురా...' అంటూ ఆయన జేబులోని సెల్‌ఫోను లోంచి పాట విన్పిస్తోంది!

"అమ్మో!... మాపెద్దాయన..." అంటూ చేతిలోని నా ఫైలు నేలమీద పడేసి, గాభరాగా జేబులోని ఫోనుతీసి నొక్కి చెవిదగ్గర పెట్టుకున్నాడు... "సార్ సార్ అలాగే సార్ తప్పకుండా సార్" అంటూ  మాట్లాడి ఫోను కట్ చేశారు శార్దూలంగారు.

"మీ పెద్దాయన  ఫోను చేశారని నెంబరయినా చూడకుండా, మీ కెలా

తెలిసింది?" అంటూ అడిగేను. నాకు సెల్ ఫోను పరిజ్ఞానం అంతగా లేదు!

"ఆయన మాపాలిట హిరణ్యకశిపుడు! అందుకే ఆయన నుండి వచ్చే కాల్స్‌కి 'రింగ్ టోన్'గా ఆపాట పెట్టుకున్నాను."

"అలా ఒక్కొక్కళ్ళకీ ఒక్కోరింగ్‌టోను పెట్టుకోవచ్చునా?" అంటూ అడిగేను.

"ఓ భేషుగ్గా పెట్టుకోవచ్చు!" అంటూ సెల్ మీద ఇటూ అటూ నొక్కేడు శార్దూలంగారు.

'...అయ్యయ్యో... జేబులో డబ్బులు పోయెనే... అయ్యయ్యో ...జేబులుఖాళీ ఆయనే...' "విన్నారా! ఇది మా నాన్న! తుని దగ్గర శ్రీరాంపురంలో వుంటాడు. పేకాటతప్ప వేరే జీవితం లేదాయనకి! మాతాతగారిచ్చిన పదెకరాలు పేకాటలోనే ఆర్పేశాడాయన! నెలనెలా ఆయన పేకాట పెట్టుబడి రెండువేలో, మూడువేలో నేనే పంపించాలి! ఇదిగో ఇది వినండి." 'ఓ అన్నా! నీ అనురాగం... ఎన్నోజన్మల పుణ్యఫలం... ఓ అన్నా!' "ఇది మా చెల్లెలు నుండి వచ్చేకాల్‌కి రింగ్‌టోను. దీనికి రెండేళ్ళలో నేనే పెళ్ళి చెయ్యాలి!" 'ఓ నాన్నా! నీమనసే వెన్న! అమృతం కన్నా! ఓ నాన్నా!...' "ఇది మాఅబ్బాయి నుంచి వచ్చేకాల్ అన్నమాట! పదిలక్షలు డొనేషను కట్టి బెంగుళూరులో మెడిసన్‌లో చేర్పించాను. నెలకి ఖర్చులకి పదివేలు పంపించినా చాలటంలేదంటాడు. ఇది వినండి" 'పొరుగింటి మీనాక్షమ్మను చూశారా?వాళ్ళఆయన చేసే ముద్దు ముచ్చట విన్నారా?'..."ఇది మా ఆవిడ...దీనికి ఒకటే బంగాం పిచ్చి!..."

ఆయన మాటలకు నేను నవ్వు ఆపుకోలేకపోయాను. "బాగుందండీ! మరి మీస్నేహితులు ఎవరయినా ఫోను చేస్తే..." అంటూ అడిగేను.

"ఇదిగో... 'సారెజహాసే అచ్ఛా... హిందూసితా హమార హమారా'...

అంతే కాదు మీలాంటి క్లయింట్లకు... అంటే LRS కింద అప్లయి చేసే వాళ్ళకు కూడా ఓ ప్రత్యేక మయిన రింగ్ టోను పెట్టాను... వినిపిస్తాను..." అంటూ ఇటూ అటూ నొక్కేరు.

'నీకోసమె నే జీవించునదీ... ఈవిరహములో ... ఈనిరాశలో... నీకోసమె నే ధ్యానించునదీ'... అంటూ భాగేశ్వరి రాగంలో, 'మాయాబజారు' సినీమాలోని పాట వినిపించింది.

"నాకీ పాట చాల ఇష్టం సార్!" అన్నాను.

" నాకూ ఇష్టమే! అందుకే దీని చిన్నింటికి పెట్టుకున్నాను..... మీరు పెద్దవారు కదా ... మీకు చెప్పినా ఫరవాలేదు... మీలాంటి క్లయింట్లకు పెట్టుకున్న ట్యూను ఇదిగో..." అంటూ మళ్ళీ నొక్కారు సెల్ మీద!

"దోచుకో దోచుకో దొరికి నంత దోచుకో... దాచుకో దాచుకో దోచినంత దాచుకో...' అని వినిపిస్తూ, నావంక చిరునవ్వుతో చూశాడాయన.

నాకు గుండెల్లోరాయి పడింది. గుటకలు మింగుతూ ఏడవలేక, చిరునవ్వు నవ్వేను.!!

" సరే! మావాళ్ళు కొల్తలు తీశారు కదా! వాళ్ళకి టీ డబ్బులివ్వండి!" అంటూ జీపు ఎక్కేశారు శార్దూలంగారు.

ఆ నలుగురిలో అతి బలిష్టుడయిన ఓ శాల్తీ నాదగ్గరకు వచ్చి "అయిదు వందలివ్వండి!" అన్నాడు అతి గంభీరమయిన స్వరంతో.

"టీలు త్రాగడానికి అయిదువందలా?" అంటూ గొణుగుతూనే ఆశ్చర్యం ప్రకటించేను.

" మారేటు అంతే!" అంటూ నావద్దనుండి అయిదు వందలూ తీసుకున్నాడు.

" ఇంకా నయం! శార్దూలంగారు 'భోజనాలకి ఇవ్వండి' అనలేదు!...అనివుంటే, ఏ అయిదువేలో ఇవ్వాల్సి వచ్చేది!" అనుకుంటూ తృప్తిపడ్డాను. జీపు సర్రున రోడ్డువైపుకు దూసుకుపోయింది!

'తాజ్ రెసిడెన్సీకి వెళ్ళి టీ తాగుతారు కాబోలు వీళ్ళు' అనుకుంటూ రోడ్డుమీదకు కాళ్ళీడ్చుకుంటూనడిచి వచ్చి, ప్రక్కనున్న పాక హొటల్లో మూడురూపాయలిచ్చి టీ త్రాగి ఇంటి ముఖం పట్టాను!!

ఆ మరుసటి రోజు, నాకు నలభై ఏళ్ళక్రితం స్థలం అమ్మిన రెవిన్యూ ఇనస్పెక్టరు గారి అబ్బాయిని కలిశాను. నా అదృష్టం కొద్దీ వాళ్ళింట్లో మా లేఅవుట్ మాస్టరు ప్లాను వుంది! నాకు ప్లాటు అమ్మినాయన అసువులు బాసినా, వాళ్ళ అబ్బాయి మాత్రం ఆ కాగితాలన్నీ జాగ్రత్తపరచాడుట! ఆప్లాను కాపీకి అయిదు వందలు అవుతుందన్నాడు. ఆ సుపుత్రుడు! అతనికి ఆ డబ్బులు చెల్లించి కాపీసంపాదించేను. మళ్ళీ దానికి మరో కాపీ తీయించి అది పట్టుకుని పుండరీకాక్షంగారింటికి వెళ్ళేను.

"సార్! మనం ఇచ్చిన ప్లాను పనికి రాదుట! ఇదిగో, ఈ మాస్టరు ప్లానులో మన సైటు చూపించాలిట!" అంటూ ప్లాను కాపీ ఆయనకి ఇచ్చేను.

" వాళ్ళు అన్నిటికీ ఇలాగే సొద్దు పెడతారు.! ఇంతకీ వాళ్ళకేమైనా ముట్టజెప్పేరా? లేదా?"

"లంచం ఇవ్వటం నేరం కదాసార్?" అన్నాను.

అంతరిక్ష యాత్రికుడు ఆదిమానవుడివేపు చూసినట్లు, ఆయన నావంక రెండుక్షణాలు చూసేడు! "సరిసరి! మీతో మాట్లాడితే నాబుర్ర పాడయిపోయేలా వుంది!

అయిదు వేలవుతుంది, అయిదురోజులాగిరండి!" అన్నాడు.

"మళ్ళీ అయిదువేలా? కొంత తగ్గించండి సార్!" అంటూ ప్రాధేయపడ్డాను.

" ఇప్పుడు అందరి దగ్గరా పదివేలు తీసుకుంటున్నా! మీరు ఓసారి నష్టపోయారని ఫిఫ్టీ పెర్సెంటు రిబేటు ఇచ్చేను మీకు!" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

అయిదు రోజుల తర్వాత పుండరీకాక్షంగారి దగ్గిర డ్రాయింగులు తీసుకుని అవిపట్టుకెళ్ళి శార్దూలంగారికి ఇచ్చేను. వాటిని చూడగానే ఆయన ముఖం చాటంత అయింది." వెరిగుడ్ బాగానే సంపాదించేరు! మా దగ్గిర ఈ'వెర్షన్' లేదు థేంక్యూ!... రెండునెలలు ఆగిరండి! ప్రోసెస్ చేద్దాం..." అంటూ మళ్ళీ తన పనిలో మునిగి పోయాడాయన.

రెండు నెలల తర్వాత మళ్ళీ వెళ్ళి శార్దూలం గారిని కలిశాను.

" ఇదిగో! మీ లెటరు! రెండో విడతగా మీరు ఇరవై ఎనిమిది వేలు కడితే సరిపోతుంది. డబ్బు చలానా కట్టేసి, ఒక నెల తర్వాత కనిపించండి!" అంటూ ఒక 'అఫీషియల్ లెటరు' నాచేతికి ఇచ్చేరు.

"సార్! ఈ డబ్బు కట్టేస్తే నాకు 'ఎప్రూవల్' ఇచ్చేస్తారా?" అంటూ అడిగేను.

"ఈ సర్వే నెంబరులోంచి మా వుడా మాస్టరు ప్లాను ప్రకారం ఒక ఎనభై అడుగుల రోడ్డు వెళ్తోంది. ఆరోడ్డు గర్భంలో మీ సైటు లేదని మీ ఏరియా తాసిల్దారు సర్టిఫై చేయాలి." అన్నారు.

నాగర్భంలోనే రోడ్డు వేస్తున్నట్లు అలజడి మొదలయింది నాలో!! సార్ ఆవేళ మీరు చూసేరుకదా! మా స్థలం ముందు రోడ్డువుంది. వెనుక ఇళ్ళున్నాయి! మీరు చెబుతున్న ఎనభై అడుగుల రోడ్డు నా స్థలానికి ఫర్లాంగు అవతల నుండి వెళ్తోంది... మట్టిరోడ్డు అప్పుడే వేశారు కూడా ... మీరు చూశారు కదా..."

" ఆ సంగతి నాకూ తెలుసు..."

"మరి?..."

"కానీ కాగితం మీద వుండాలి! లేకపోతే రూల్సు ఒప్పుకోవు!" అన్నారు. నేను విచారంగా ముఖంపెట్టి నిలబడటం గమనించి "సరే! ఏదోమార్గం చూద్దాంలెండి! డబ్బుకట్టేసి ఒక నెల ఆగిరండి!.." అంటూ మెత్తబడ్డారు శార్దూలంగారు.

'బ్రతుకు జీవుడా!' అనుకుంటూ వుడా ఆఫీసు నుండి బయటపడ్డాను. మరుసటిరోజే ఇరవై ఎనిమిది వేల రూపాయలు వుడా పేరున చలానా రూపంలో చెల్లించి ఓ నెలరోజుల తరువాత మళ్ళీ అక్కడికి వెళ్ళేను!

ఈసారి వుడా ఆఫీసు కొత్త అందాలతో, హంగులతో కళకళలాడిపోతోంది!

ప్రవేశద్వారం దగ్గర 'లంచం ఇచ్చుట నేరం' అని పెద్దబోర్డు తగిలించివుంది. 'లంచం పుచ్చుకొనుట నేరము' అని మాత్రం ఎక్కడా రాసిలేదు!!

ఇంతకు ముందున్న అఖిలాండ బ్రహ్మాండ కోటీ నాయకుడి గారికి బదిలీ అయిపోయి, ఆయన స్థానంలో లక్ష్మీధరం గారు వచ్చేరుట! అలాగే శార్దూలంగారికి కూడా బదిలీ అయిపోయి ఆసీటుకు మత్తకోకిల అనే ఆవిడ వచ్చేరు.. ఆవిడ దగ్గరకు వెళ్ళి "మేడం నమస్కారం !LRS లో రెండోవిడత ఇరవై ఎనిమిది వేలూకట్టేశాను. నెల తర్వాత రమ్మన్నారు... నా నెంబరు... " అంటూ మాట్లాడుతూ వుంటే "ప్రస్తుతం పనిలో వున్నాను... అక్కడ విజిటర్స్ హాలులో కూర్చోండి! ఓఅర గంటలో పిలుస్తాను...." అన్నారు.

నిజమే! ఆవిడ పనిలోనే వున్నారు! ఎదురుగా టేబిలు మీది వేరు శెనక్కాయల పోట్లాంలోంచి ఒక్కోకాయతీసి, టేబిలుమీద కొట్టి పలుకులు తింటున్నారు.

అది పనికాదని ఎవరనగలరు? నేను వెళ్ళి వెయిటింగ్ హాలులో కూర్చున్నాను. మాట ఇచ్చిన ప్రకారం సరిగ్గా ఆవిడ అరగంట తర్వాత అక్కడికి వచ్చి " నేను ఇంకా పూర్తిగా ఛార్జీ తీసుకోలేదు! ఓ మూడు వారాలు ఆగి రండి" అంటూ బయటకు వెళ్ళి లిఫ్టు ఎక్కి మరో అంతస్తుకు వెళ్ళిపోయారు. నీరసంగా అక్కడి నుండి బయటకు వచ్చేశాను.

మూడు వారాలు ఆగి మళ్ళీ వుడా ఆఫీసుకు వెళ్ళేను. మత్తకోకిల గారిని పదిరోజుల కిందటే ఇంకో సెక్షన్‌కి మార్చేరుట! ఆ సీటుకు'మత్తేభం ' అనే కొత్తాయన వచ్చేరు! నా అదృష్టం కొద్దీ ఆయన సీటులోనే వున్నారు నేను వెళ్ళేసరికి!

మత్తేభంగారికి నమస్కరించి నాకథ అంతా వినిపించేను. "మీరిఫరెన్స్ నెంబరు రాసి ఇవ్వండి! ఆఫైలు ఎక్కడుందో చూస్తాను! ఓవారం ఆగిరండి!" అన్నాడాయన.

నెంబరు ఆయనకి రాసిచ్చి వచ్చేశాను

సరిగ్గా వారం రోజుల తర్వాత, స్వాతిముత్యం సినిమాలో ఉద్యోగం కోసం సోమయాజులుగారి దగ్గరకెళ్ళి నిలబడ్డ 'కమల్‌హాసన్'లా చేతులు కట్టుకుని, మత్తేభంగారి ఎదుట నిలబడ్డాను.

నావంక 'ఏంకావాలి?' అన్నట్లు నుదురు చిట్లిస్తూ కళ్ళతోనే ప్రశ్నించాడాయన.

"వారం రోజులు ఆగిరమ్మన్నారు కదా!... కిందటి మంగళవారం వచ్చేను కదా..." అంటూ గుర్తు చేశాను.

"స్లిప్పు మీద నెంబరు రాసి ఇచ్చేరు, మీరేనా?"

"అవును సార్!"

"మీ ఫైలు కనబడ్డంలేదు!"

నెత్తిన పిడుగుపడ్డట్లయింది! " మరి, ఎలాగసార్!" నోరు పెగుల్చుకుంటూ అడిగేను.

"వెతుకుతాం!"

"ఫైలు ఎలాపోయింది సార్?"

"పోయిందని చెప్పేనా?...కనబడటం లేదు అని చెప్పేను! అంటే... భవిష్యత్తులో ఎప్పుడయినా అది కనబడే అవకాశం వుందని అర్థం! అవును కదా!... మరి, పోయిందంటే... భవిష్యతులో వెదికినా కనబడే అవకాశంలేదు గాక లేదు అని అర్థం! అవును కదా!... మరి, నేను కనబడ లేదు అంటే మీరు 'పోయింది' అని ఎలా అనుకుంటున్నారు?" తాపీగా అన్నాడాయన.

"అదికాదు సార్!..." అంటూ వుంటే" గాభరాపడకండి... ఓవారం ఆగిరండి, వెతుకుతాను!" అంటూ నాకు ధైర్యం చెప్పేరు! ఓ వారం తర్వాత మళ్ళీ మత్తేభంగారి దర్శనార్థం వెళ్ళేను!

నన్ను చూస్తూనే "కనబడని ఫైలు మేస్టారు మీరేనా?" అంటూ గుర్తు పట్టి పలకరించేరు. " అవును సార్! దొరికిందా?" ఆత్రంగా అడిగేను.

" నేను పోయిందని మీకు చెప్పేనా?" ఎదురు ప్రశ్న వేశాడాయన.

" అదే సార్! కనబడటంలేదన్నారు.."

" అవును కదా.. అప్పుడు మీరేమని అడగాలి?... 'కనబడిందా?' అని అడగాలి! 'దొరికిందా' అని అడగకూడదు!..."

"క్షమించండి సార్! కనబడిందా?"

" చెప్తాను... కంగారు పడకండి! చదరపు గజాలను చదరపు మీటర్లలోకి మార్చాలంటే ఫేక్టరు ఏమిటీ?" అని అడిగేరు.

ఎదురు చూడని ఈ ప్రశ్నకు కొంత తొట్రుపడి " తెలీదుసార్" అన్నాను. "చదరపు గజాలను చదరపు మీటర్లలోని మార్చాలంటే ఫేక్టరు ఎంతో తెలీదు! ఒక ఫైలు పోవటానికీ, కనబడక పోవటానికీ తేడా తెలీదు! టంచనుగా మధ్యాన్నం మూడు గంటలయ్యే సరికి 'సందర్శకుల వేళలు' అంటూ మానెత్తి మీద రైడైయిపోవటం మాత్రం తెలుసు..." అని గొణుక్కుంటూ ఆయన టేబిలు సొరుగు లోంచి ఓ ఫైలు బయటకు తీసేరు!

అది నాఫైలే! హమ్మయ్య! కనబడిందన్నమాట!! మూడు నిమిషాలు సేపు ఆయన ఆఫైలు అంతా తిరగేశారు! " మీరు రెండో విడతగా ఇరవై ఎనిమిది వేలు కట్టాలి!" అన్నారు.

"అదేమిటిసార్? ఇరవై ఎనిమిది వేలు ఎప్పుడో కట్టేశాను కదా!"

ఆయన వంక అయోమయంగా చూస్తూఅడిగేను.

"కట్టేశారా! మరి ఆ రసీదు ఇందులో కనబడటం లేదు!"

"ఎలా పోయిందిసార్?"

" పోయిందని చెప్పలేదు నేను! ఇందులో కనబడటంలేదని చెప్పేను!"

" అదేసార్! ఎందుక్కనపడ్డంలేదూ?" చిరాగ్గా అడిగేను.

"ఇందులో లేదు కాబట్టి కనబడటంలేదు. ఉంటే కనబడుతుంది కదా!"

" ఇప్పుడు మరేం చేయాలి సార్?" గాభరాగా అడిగేను.

"అలా దారికి రండి, చెబుతాను.! నిదానం ప్రధానం అన్నారు పెద్దలు! మీరు తిన్నగా అలా అక్కడ నుండి ముందుకు వెళ్లి ఎడమకు తిరిగి, మళ్ళీ కుడివైపుకు తిరిగితే, అక్కడ వరుసగా మూడు క్యుబికల్స్ కొత్తగా కట్టినవి కనిపిస్తాయి! ఆఖరి క్యూబికల్‌లో ఓ కంప్యూటరు వుంటుంది. దాని ముందు సన్నగా కునుకు తీస్తూ ఓ కుర్రాడు కూర్చుని వుంటాడు! అతడు నిద్రపోతూవుంటే లేపకండి.! లేపితే కరుస్తాడు. ఎందుకంటే అతడు మా పెద్దసారు మేనల్లుడు!! అతడు నిద్ర లేచే వరకూ నిరీక్షించి, మీ 'రిఫరెన్సు నెంబరు' అతనికివ్వండి! అతడు కంప్యూటరులో వెదికి మీరు కట్టిన ఆ సొమ్ము మాకు జమ అయిందో లేదో చెబుతాడు." అంటూ నాకు దారి చూపించేరు మత్తేభంగారు.

ఆయన చెప్పిన ప్రకారం వెదుక్కుంటూ వెళ్ళేను! నా అదృష్టం కొద్దీ ఆకుర్రాడు కునకటంలేదు! కంప్యూటరులో పేకాడు కుంటున్నాడు!

నన్ను చూసి పేకాటలోంచి బయటకు వచ్చేడు.అతడికి నా రిఫరెన్సు నెంబరు ఇచ్చి డబ్బు జమ అయిందో లేదో చూడమని ప్రాధేయపడ్డాను.!

"రేపు రండి! వేరే పనిలో వున్నాను!" అన్నాడు.

" బాబూ! ఇన్నేసి సార్లు ఈ మూడంతస్తుల మేడ మెట్లు ఎక్కలేక పోతున్నాను! కాస్త చూసి చెప్పండి!"అన్నాను.

"లిఫ్టువుందికదా! మేడమెట్లు ఎందుకు ఎక్కుతున్నారు.?" అంటూ చికాకు పడ్డాడు.

"లిఫ్టు వుంది కానీ కరెంటు వుండాలి కదా! ఇప్పటికి ఈ ఆఫీసుకి తిరిగిన ఇరవై ఆరు సార్లలోను పదహారు సార్లు కరెంటు లేక మెట్లు ఎక్కే వచ్చేను!"

" మేం అలా చెయ్యం! కరెంటు వచ్చేదాకా కిందనే కబుర్లు చెప్పుకుంటూ నిలబడతాం! పోయిన కరెంటు రాక ఏమవుతుంది? అది వచ్చాక అప్పుడు లిఫ్టులో వస్తాం. మీరు రేపటి నుండీ అలాగే చెయ్యండి"! అంటూ నామీద దయతలచి కంప్యూటరులో

నాఫైలు తెరిచాడు. " మీరు రెండోసారి కట్టేశారు! ఇంకేమీ కట్టన్కరలేదు!" అన్నాడు. నానెత్తిన పాలుపోసినట్లయింది.

"థేంక్యూబాబూ!" అంటూ గబగబా మత్తేభంగారి దగ్గరకు పరుగెత్తేను.

"సార్! కంప్యూటరులో నేను కట్టినట్లువుంది..." అన్నాను, రొప్పుతూ.

"అక్కడ ఎంటరయిపోయింది... కానీ ఇక్కడ రసీదు లేదు... ఎలామరి?" అంటూ కొంతసేపు ఆలోచించి... "సరే ఓ పని చెయ్యండి! మీ దగ్గర ఒక చలానా రసీదు వుంటుంది కదా!... దాన్ని జెరాక్స్ తీయించండి! ఓ గెజిటెడ్ ఆఫీసరు చేత ఆజిరాక్సు కాఫీని 'ఎటెస్టేషను' చేయించండి! దాన్ని రేపు మీరు తీసుకువస్తే ఈఫైలులో పెడదాం... ఆ తర్వాత చూద్దాం" అన్నారు మత్తేభంగారు.

"చూద్దాం కాదు చేద్దాం అనండి సార్" అన్నాను కాస్త చనువుతీసుకుంటూ.

"ఫైలు కాబట్టి అది చూసేది, చేసేది కాదు! అవునా?!ఫైలు సంగతిచూద్దాం అనాలి! పని సంగతయితే చేద్దాం అనాలి.!" అంటూ నా తెలుగు భాషాపరిజ్ఞానాన్ని సరిదిద్దేడాయన.

" మరి, నేను వెళ్తాను సార్!"

" వెళ్తాను అనకూడదు! 'వెళ్ళొస్తాను' అనాలి!...అలా ఎన్నోసార్లు వెళ్ళివస్తేగాని మీ పని పూర్తి కాదని మీరు తెలుసుకోవాలి!" అంటూ మళ్ళీ ఇంకేదో ఫైలు చూడటంలో మునిగి పోయాడాయన!

మర్నాడు, నావద్దనున్న రసీదుకు ఫోటోకాఫీ తీయించి ఎటెస్టేషను చేయించి, మత్తేభం గారికి ఇచ్చేను. దానికి కన్నాలు కొట్టి నాఫైలులో భద్రపరిచేడాయన.

" ఇంక నా సైటుకి ఎప్రూవల్ వచ్చేస్తుంది కదా?" అంటూ అడిగేను.

" రాదు!" అన్నాడాయన.

"ఎందుకని?" బిక్కమొగం పెట్టుకుని అడిగేను.

"ఇది ప్రభుత్వ భూమి కాదని తాసిల్దారు నుండి ఓ సర్టిఫికేటు తేవాలి!"

నాకు సహనం నశించిపోయింది!!

"సార్! ఇప్పటికి రెండుసంవత్సరాల నుండీ మీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాను... తడవకో సర్టిఫికేటు తెమ్మంటారు! ఏయే సర్వే నెంబర్లు ప్రభుత్వ భూములో మీకే తెలుస్తుంది. దానికి మీ దగ్గర బోలెడు యంత్రాంగం వుంది.! నేనింక తిరగలేను సార్! మీ ఇష్టం! ఏదోఒకటి చెయ్యండి! అప్రూవల్ ఇస్తే సంతోషం! లేకపోతే నేను చేయగలిగేది ఏమీ లేదు" అంటూ చిరాగ్గా కుర్చీ లోంచి లేచాను.

ఆయన ఏమీ మాట్లాడలేదు!

'ఇంతవరకూ వచ్చాక పని పాడు చేసుకుంటున్నానేమో' నన్న దిగులు కల్గింది. చికాకు తగ్గించుకుని" ప్లీజ్ తరుణోపాయం మీరే చెప్పండి!" అన్నాను మళ్ళీ.

మత్తేభంగారు మౌనంగా కొంత సేపు కళ్ళు మూసుకున్నారు!

కొంతసేపు పోయాక కళ్ళు తెరిచి " మీరు ఇంతవరకూ వుడాకు ఎంత కట్టేరో ఆ మొత్తం అంకె తలచుకోండి!" అన్నారు.

" తల్చుకున్నాను!" ఆశ్చర్యంతో అన్నాను.

"దానికి మరో అంతకలుపుకోండి!"

"కలుపుకున్నాను!"

"అందులో సగం వుడాకిచ్చేయ్యండి!"

"ఇచ్చేశాను!...రెండు చలానాలు కట్టేను కదా"... నవ్వుతూ అన్నాను.

"మిగిలిన దాంట్లో సగం దేవుడికిచ్చేయ్యండి!"

"ఇచ్చేశాను!"

"ఇంక మీదగ్గర వున్న మొత్తానికి నేనో ఆరువేలు ఇచ్చాను అనుకొని కలుపుకోండి!"

"కలుపుకున్నాను"

"ఇప్పుడు ఆమొత్తం నాకిచ్చేయండి!" మెల్లగా గొణిగేరు మత్తేభంగారు. ఆయన 'ఆ' మొత్తం అన్నారో 'నా' మొత్తం అన్నారో సరిగ్గా విన్పంచలేదు!

'నా' మొత్తం అంటే ఆరువేలు! 'ఆ'మొత్తం అంటే ముప్ఫయి వేలు!! ఎందుకంటే, నేను కట్టిన మొత్తం నలభై ఎనిమిది వేలు!!

"వెళ్ళొస్తాను సార్!" అంటూ మత్తేభం గార్కి నమస్కరించేను.

"గాభరా పడకండి! నాకిలాంటి చిక్కులెక్కలు అంటేసరదా! " అంటూ చనువుగా నవ్వేరు! వుడా ఆఫీసు నుండి తిన్నగా ఇంటికి వచ్చేశాను. ఇంక సైటు ఎప్రూవల్ వ్యవహారం గురించి ఆలోచించటం మానేశాను.

మరొక సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది! ఈలోగా వుడా పెద్దాయన లక్ష్మీధరం గారికి బదిలీ అయిపోయింది!

ఆయన స్థానంలో చంద్రధరంగారు వచ్చేరట!

చంద్రధరంగారు సమర్థుడయిన అధికారి అనీ, ముఖ్యంగా స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో చొరవ తీసుకుని పనులు వేగవంతం చేస్తున్నారనీపేపర్లో చదివేను. నా స్థలానికి మోక్షం లభిస్తుందనే ఆశ మళ్ళీ నాలో చిగురించింది!! అదిగో! అనుకోకుండా అంతలోనే ఈ ఫోన్‌కాల్!

'రేపు వెళ్ళిచూద్దాం' అనుకుంటూ నిద్రలోకి జారిపోయాను!

* * *

మరునాడు మధ్యాహ్నం మూడు గంటలకు 'వుడా కాన్ఫరెన్సు హాలు'కు చేరుకున్నాను.

అప్పటికే హాలులో మూడువందల మంది వరకూ కూర్చుని వున్నారు!

అంతలోనే చంద్రధరంగారు వేగంగా వచ్చి వేదిక నెక్కి క్లుప్తంగా మాట్లాడేరు. "వుడావ్యవహారాలన్నీ పారదర్శకంగా జరుగుతాయి! ఎవ్వరికీ లంచాలు ఇవ్వవలసిన పనిలేదు! త్వరలోనే అర్హులందరికీ అప్రూవల్ కాగితాలు అందుతాయి! మొదటవిడతగా వెయ్యి అప్లికేషన్లు క్లియర్ చేస్తున్నాం ఈవేళ!" అంటూ గబగబా కొన్ని పేర్లు పిలిచి'క్లియరెన్సు పేపర్లు వారికి స్టేజీమీదనే అందజేశారు!

చప్పట్లతో కాన్ఫరెన్సు హాలు మారుమ్రోగిపోయింది.!

తరువాత ప్రాంతాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి పేర్లు పిలిచి, ఎవరి అప్రూవల్ పేపర్లు వారికి అందజేసే ఏర్పాటు చేశారు.

ఓ గంట తర్వాత నావంతు వచ్చింది! ఆనందంతో కాగితాలు అందుకుని, అక్కడే ఓ నాలుగు మార్లు చదువుకుని తరువాత హాలులోంచి బయటకు వచ్చేను.

వుడా బిల్డింగు నుండి బయటకు వస్తుంటే ఎదురుగా రోడ్డు ప్రక్కన ఓ పెద్ద ప్రకటన బోర్డు కనిపించింది.

'ఒక్క ఐడియా మీ జీవితాన్నే మార్చేస్తుంది!' అని రాసి వుంది!

ఔను!! ఒకసామాన్య కార్యకర్త అన్నాహజారే గారు దేశాన్ని ఓ కుదుపు కుదపలేదా?

'ఒక్కనిజాయితీ గల సమర్థవంతమయిన అధికారి మొత్తం అవినీతి వ్యవస్థనే మార్చేయగలడు!' అనుకున్నాను. ఆక్షణం నుండీ 'వుడా' ఆఫీసు మీద నాకు గౌరవం పెరిగిపోయింది!!

★

(భక్తి సమాచారం, మే 2013)